www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 5 జనవరి 2024

5

చిత్తూరు

రాజకీయాల్లో మార్పులు, చేర్పులు సహజం

మా నాయకుడు జగన్, ఆయన వెంటే మేము : పెద్దిరెడ్డి

విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాజకీయాల్లో మార్పులు చేర్పులు సహజమని, తమ నేత జగన్‌మోహ్మన్‌రెడ్డి మాత్రమేనని, వచ్చే ఎన్నికలో ఆయన్ను సిఎం చేయడమే లక్ష్యంగా పనిచేయనున్నట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని నాగయ్య కళాక్షేత్రంలో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జగన్ సోదరి షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరినా వైఎస్సార్‌సీపీ నుంచి వెళ్ళేవారు లేరని స్పష్టం చేశారు. తాము వైఎస్ రాజశేఖర్‌రెడ్డిపై అభిమానంతో వైసిపి కోసం పనిచేస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీలు, టిడిపిలు ఎన్ని వచ్చినా మేము మా ముఖ్యమంత్రి వెంటే నడుస్తామని అన్నారు. కుటుంబాలను చీల్చి రాజకీయం చేసే నైజం సోనియా గాంధీ, చంద్రబాబులది విమర్శించారు. పూతలపట్టు ఎంఎల్‌ఏ ఎంఎస్ బాబు పార్టీపై చేసిన వ్యాఖలపై స్పందిస్తూ జెడ్పిటిసిగా ఓడిపోయిన ఎంఎస్ బాబుకు పూతలపట్టు టికెట్ ఇచ్చి గెలిపించేందుకు ఎంతో కృషిచేశామని, అలాంటిది ఆయన పార్టీకి విశ్వాసంగా ఉండాల్సింది పోయి అనుచితంగా మాట్లాడటం సరికాదని అన్నారు. ఇప్పటికైనా పార్టీపై విశ్వాసం చూపితే ఆదరిస్తామని తెలిపారు. ఆయన వెంట ఎంపి రెడ్డప్ప, జెడ్‌పి ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

నోటీసులకు బెదిరే ప్రసక్తే లేదు..

- కొనసాగుతున్న అంగన్వాడీల సమ్మె
- నేటి నుంచి నిరవధిక దీక్షలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

అంగన్వాడీలు జిల్లా వ్యాప్తంగా సమ్మెను కొనసాగిస్తున్నారు. కలెక్టరేట్ ముట్టడి విజయవంతం కావడంతో రెట్టించిన ఉత్సాహంతో జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో గురువారం నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చిత్తూరు సీడీపీఓ కార్యాలయం, యాదమరి తహశీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. అలాగే జిల్లాలోని కార్వేటినగరం, నగరి, కుప్పం, శాంతిపురం, వీకోట, పలమనేరులో అంగన్వాడీలు నిరసన దీక్షల్లో పాల్గొన్నారు. రాష్ట్ర యూనియన్ల పిలుపుమేరకు శుక్రవారం నుండి నిరసన దీక్షా శిబిరాల్లో 24 గంటల పాటు నిరవధి దీక్షలకు పూనుకోనున్నారు. ప్రభుత్వం అంగన్వాడీల ప్రధాన డిమాండ్లు జీతాల పెంపు, గ్రాట్యూటీ అమలు వంటి అంశాలపై స్పష్టమైన హామీలు ఇవ్వాలని ట్రేడ్ యూనియన్ నాయకులు వాడ గంగరాజు, సురేంద్రన్, చైతన్యలతో పాటు అంగన్వాడీ యూనియన్ నాయకులు షకిల, పద్మ, మమత, బుజ్జి, సృజనిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగాల నుండి తొలగిస్తామని నోటీలు జారీ చేస్తే బెదిరే ప్రసక్తే లేదన్నారు.

సమ్మెనుద్దేశించి మాట్లాడుతున్న నరసింహారావు, గంగరాజు

ప్రభుత్వం వెంటనే సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కార్వేటినగరం: స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో 24 రోజులుగా కొనసాగుతున్న అంగన్వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా గురువారం పద్మ సరస్సు గ్రామం చెరువు నీటిలోకి దిగి నిరసన తెలిపారు. సిఐటియు కార్యదర్శి మమత, ఏఐటియుసి కార్యదర్శి రాధమ్మలు మాట్లాడుతూ తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నిండా ముంచేసిందంటూ నినాదాలు చేస్తూ చెరువులో దిగి నిరసన తెలిపారు. చిత్తూరు జిల్లా విద్యా పరిరక్షణ కమిటీ ఛైర్మన్ గోవిందయ్య, ఏపీటీఎఫ్ 1983 జిల్లా అధ్యక్షులు కిరణ్ కుమార్ వీరికి మద్దతు తెలిపారు.

పలమనేరు: స్థానిక ఐసిడిఎస్ ఆఫీసు వద్ద గురువారం 24వ రోజు అంగన్వాడీల నిరవధిక సమ్మె కొనసాగింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర నాయకులు నరసింహారావు, జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగారాజు మాట్లాడుతూ ఈనెల 5వ తేదీ నుంచి అంగన్వాడీలు, హెల్పర్లు విధులకు హాజరు కావాలని లేకుంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని ప్రభుత్వం భయపెడుతున్నా వెనక్కు తగ్గే ప్రసక్తే లేదని, అంగన్వాడీల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గిరిధర్ గుప్తా, ఓబుల్ రాజు, ఏఐటియుసి నాయకులు సుబ్రహ్మణ్యం, అంగన్వాడీలు పాల్గొన్నారు.

యాదమరిలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు చైతన్య, కార్వేటినగరంలో చెరువులో దిగి నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

నేడు సమగ్ర శిక్ష ఉద్యోగుల 'చలో విజయవాడ'

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సమ్మె గురువారానికి 16వ రోజుకు చేరుకుంది. తమ సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల జేఏసీ నాయకులు తెలిపారు. గురువారం కలెక్టరేట్ ఎదుట సమ్మెను కొనసాగించారు. చలో విజయవాడను జిల్లాలోని సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొనే విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు విల్వనాథం, శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు.

ఓటర్ల మార్పులు, చేర్పులు వేగవంతం : జెసి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జెసి

పౌర సరఫరాలశాఖ ద్వారా ప్రజలకు నిత్యావసర వస్తువులను వేగవంతంగా సరఫరా చేయాలని, అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేయాల్సిన వస్తువులను పూర్తిస్థాయిలో చేర్చాలని, ఫ్రీ హోల్డ్ రైట్స్‌కు సంబంధించి ఈకేవైసీ శుక్రవారం మధ్యాహ్నం లోపున పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. గురువారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా జెసి మాట్లాడుతూ ఫ్రీహెూల్డ్ రైట్స్‌కు సంబంధించి వచ్చిన దరఖాస్తులకు ఈకేవైసీ పూర్తి చేయాలన్నారు. ఇంకా అర్హత కలిగిన వారికి అసైన్ మెంట్ భూముల పంపిణీకి ప్రతిపాదనలు పంపాలన్నారు. రేషన్ పంపిణీ కార్యక్రమం ఎండీయూ ఆపరేటర్ల ద్వారా నిర్ణయించిన ప్రకారం వేగవంతంగా వాలంటీర్ల ద్వారా పంపిణీ చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు పంపిణీ చేయాల్సిన టిహెచ్ఆర్ వస్తువులు వెంటనే సరఫరా చేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితాను ఈ నెల 22న విడుదల చేయాల్సి ఉందని, దానికి సంబంధించి ఈనెల 12 లోపున క్షేత్రస్థాయి విచారణ పూర్తి చేయాలన్నారు. డిఎస్ఓ శంకరన్, డిపిఓ లక్ష్మి పాల్గొన్నారు.

వరి నాట్లలో కూలీల సమస్యకు చెక్

- డ్రమ్ సీడ్‌తో సరికొత్త ఒరవడి
- తక్కువ ఖర్చుతో అధిక లాభాలు..

ప్రజాశక్తి- వెదురుకుప్పం

రైతులు ప్రస్తుతం పంట పొలాల్లో వరి నాట్లను రైతు కూలీలకు బదులుగా డ్రమ్ సీడ్ లాగే పద్ధతి ద్వారా వేస్తున్నారు. దీని వలన ఖర్చు, సమయం రెండూ ఆదా అవుతాయని వ్యవసాయాధికారి వనిత చెబుతున్నారు. రైతులకు సాగు ఖర్చులతను తగ్గించడంతో డ్రమ్ సీడ్ సరికొత్త ఒరవడిని సృష్టించిందని ఆమె అన్నారు. డ్రమ్‌సీడ్ ఉపయోగాలు ఆమె మాటల్లోనే..

మండలంలో 25 పంచాయతీలు ఉన్నాయి. గత సంవత్సరం నవంబరు, డిసెంబరు నెలలో కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు నిండి నీళ్లు పుష్కలంగా ఉన్నాయి. ఈ సారి నీటి కొరత ఉండదు. అందువల్ల రైతులు వరి పంటను పండించేటందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం వ్యవసాయంలో వస్తున్న సరికొత్త యంత్రాలతో

రైతులకు ఖర్చు తగ్గి ఆదాయం పెరుగుతోంది. గతంలో రైతులు వరి నాట్లు వేయాలంటే కూలీలపై ఆధారపడేవారు అంతేకాకుండా కూలి ఖర్చులు ఎక్కువగా ఉండేవి. అయితే ప్రస్తుతం డ్రమ్ సీడ్ పద్ధతి ద్వారా తక్కువ ఖర్చుతో కూలీలు అవసరం లేకుండానే వరినాట్లు వేస్తున్నారు. మండలంలో ప్రస్తుతం 120 హెక్టార్లుల్లో వరి పంట ప్రారంభ దశలో ఉంది. సాగు ఇంకా పెరుగుతుంది.

పంట మంచి దిగుబడి వస్తుంది

- వనిత వ్యవసాయ అధికారి, వెదురుకుప్పం

డ్రమ్ సీడ్ ద్వారా నాట్లు వేసుకోవడం వలన వరి పైరులో నాట్లకు సుమారుగా అర అడుగు తేడా ఉంటుంది. దీంతో పంటకు గాలి వెలుతురు సక్రమంగా అందుతుంది. చీడపురుగుల బెడద కొంతవరకు తగ్గుతుంది. వరి పంట బాగా పెరిగి రైతుకు మంచి ఆదాయం వస్తుంది. దీని వలన కూలీల ఖర్చు తగ్గుతుంది.

డ్రమ్ సీడ్ వలన ఇబ్బంది లేదు..

- కనుకొండారెడ్డి రైతు, మాంబేడు

గతంలో వరి నాట్లు వేయాలంటే కూలీలను పెట్టుకుని వారికి కూలితోపాటు భోజనాలు పెట్టి వేయాల్సి వచ్చేది. దీని వలన ఖర్చు ఎక్కువగా ఉండటంతో పాటు సమయం ఎక్కువగానే పట్టేది. అయితే డ్రమ్ సీడ్ వలన ఖర్చు, సమయం రెండు ఆదా అవుతున్నాయి. నేను గత మూడు సంవత్సరాలుగా డ్రమ్ సీడ్ పద్ధతిలోనే వరి నాట్లు వేస్తున్నాను. పంటకు రోగాల బాధ లేదు. కూలీలను పెట్టి వరి నాట్లతో పోలిస్తే పంట దిగుబడి బాగానే ఉంది. దీని వలన ఎటువంటి ఇబ్బందులు లేవు.

దోచేద్దాం.. సహజ సంపద.!

- పెచ్చు మీరుతున్న అక్రమార్కుల ఆగడాలు
- సహజ వనరులను నాశనం చేస్తున్న వైనం
- యథేచ్ఛగా ఇసుక, కలప తరలింపు
- అధికారపార్టీ నేతలదే కీ రోల్
- మూడుపుల మూటలతో మూగబోతున్న అధికారులు

అధికారం అండగా ఉంది.. అలసే ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. మరోసారి అధికారం వస్తుందోరాదో.. అందినకాడికి దోచుకోవాలి.. అబ్బినకాడికి దాచుకోవాలి అన్నచందంగా ఉంది అధికారపార్టీ నాయకులు వ్యవహారం. దోపిడీకి కాదేది అనర్హం అన్నట్లు ప్రకృతి వనరులను నాశనం చేస్తున్నారు. కలప, ఇసుకను యదేచ్ఛగా తరలించేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇందంతా సాఫీగా సాగిపోతున్నా.. అధికారులు మాత్రం అధికార పార్టీ నేతల మాటలు.. కట్టల మూటలకు మూగబోతున్నారన్నది స్థానికులు ఎక్కుబెడుతున్న విమర్శలు..

ప్రజాశక్తి-పలమనేరు

కలప తరలిపోతోంది..

పలమనేరులో అక్రమార్కులకు అధికారులు తోడై వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. కనిపించిన సహజ వనరులను దోచేస్తూ సొమ్మచేసుకోవడం పరిపాటిగా మారింది. పచ్చని వృక్ష్యాలు నిత్యం రంపపు కోతలకు గురై నేలకొరుగుతున్నాయి. జాతీయ రహదారిగుండా అక్రమార్కులు బహిరంగంగానే తరలించేస్తున్నారు. ఇదంతా అధికారుల కనుసన్నల్లో జరుగుతున్నా.. అధికారులు పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు మండిపడుతున్నారు. గ్రామాల్లో పలమనేరు నియోజకవర్గంలో ఐదు మండలాలు ఉన్నాయి అందులో, ప్రతి మండలంలో, అధికారులు , అవినీతి, అక్రమాలు మూడు పువ్వులు ఆరు కాయలు అన్న విధంగా తయారయ్యాయి, ఈ నేపధ్యంలో చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గంలో, పచ్చదనం అక్రమార్కుల చేతుల్లో పడి తరిగిపోతుంది, వాల్టా చట్టమును పక్కన పెట్టారు. అక్రమాకులతో చేతులు కలిపి అవినీతి బాట పట్టారని ఆరోపణలు ఉన్నాయి. ఏ ఒక్క వక్షాన్ని నరికి వేతకు గురిచేయాలంటే వాల్టా చట్టం అమలు చేయాల్సిన అవసరం ఉంది ఒక చోట నాలుగు మొక్కలు నాటితే ఆపై వాటిని పెంచి, పోషించాక, ఆ తర్వాత నరికివేత కు కారణమైన సమస్యను అధికారులు దష్టికి తీసుకెళ్లి ఆ వక్షాన్ని వాల్టా చట్టం ప్రకారం నరికించే ప్రయత్నం అధికారులు తీసుకొని అనుమతి ఇస్తారు, కనీసం అవి ఏవి ఇక్కడ జరగలేదు వాల్టా చట్టాన్ని తుంగలో తొక్కుతూ అక్రమార్కులు తాము ఇష్టానుసారము వక్షాలను రంపాలతో తెగ నేరికించి ఇలా, పబ్లిక్ గా పట్ట పగలు, జాతీయ రహదారి గుండా వాహనాల్లో నింపి తరలిస్తున్నారు. స్థానిక పలమనేరు జాతీయ రహదారి గుండా ఇలా టాక్టర్లలో ఫలసాయం ఇచ్చే వందేళ్ళనాటి చింత చెట్లను ముక్కలుగా తరిగి తరలిస్తుంటే సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు, ఈ విషయమై పలమనేరు అటవిరేంజ్ పశ్చిమశాఖకు చెందిన అధికారియైన, యప్, యస్ ,ఓ సుకుమార్ కు సమాచారం తెలిసినా, చరవాణిలో సంప్రదించ ప్రయత్నించినా, స్పందించలేదు, ఇలాంటి అధికారులు ఉన్నచోట ఇలానే భారీ వక్షాలు నరికివేతకు గురవుతూ ప్రతి ఏటా వేలాది వక్షాలు నేలకు వొరుగుతున్నాయని ప్రజావిమర్శలు తావిస్తున్నాయి.

ఇసుక బహిరంగంగా అక్రమ రవాణా

అలాగే పలమనేరు పట్టణం జాతీయ రహదారిలో ప్రతినిత్యం టాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా కొనసాగుతూనే ఉంటుంది, పలమనేరు మున్సిపాలిటీ అంచునే ఉన్న ప్రభుత్వ కౌండిన్యనది లోయలో, పేరుకుపోయిన ఇసుక సంపదను, సంబంధిత ఇసుకాశూరుల కన్ను పడింది, రాత్రి పగలు తేడా లేకుండా బలమైన యంత్రాలు జెసిబి వంటివి ఉపయోగించి తవ్వకాలు ప్రారంభించారు, ఇసుకలు స్టాకు పాయింట్లుగా ఏర్పాటు చేసుకొని కౌండిన్య నది నుండి నేరుగా ఇసుకను ట్రాక్టర్లో నింపి రవాణా చేస్తూ ప్రతి ట్రాక్టర్ లోడ్ పై నాలుగు వేలకు మంచి

అమ్మకం చేపట్టి ప్రతిరోజు లక్ష రూపాయలు దోచేస్తూ కౌండిన్య నది లోయ సుమారు 255 కిలోమీటర్ల పొడువునా, 50 మీటర్ల వెడల్పుతో తవ్వకాలు చేపట్టి ఇసుక రేణువులను కొంతమంది అధికార పార్టీ నాయకులు పలువురు కౌన్సిలర్లు ఇదేచ్ఛగా, అధికారులను మభ్యపెట్టి భయపెట్టి, విక్రయాలు జరిపి కోట్లాది రూపాయలు, ఆర్జించి కోట్లకు పరిగెత్తుతున్నారు, ఇలా ప్రభుత్వ సంపదను దోచేస్తున్న, అక్రమార్కుల నుండి అధికారులు చేతులు చాపుతూ, మామూళ్ళ మత్తులో పడ్డారని అందుకే ఇలా నిర్భయంగా ఇసుక అక్రమ రవాణా ప్రభుత్వ సంపదకు కావలి లేకుండా పోయిందని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో వాగులు, వంకలు, చెరువులు కుంటలు అడవుల్లో ఉన్న ఇసుక స్థలాలను కనిపెట్టి తవ్వకాలు ప్రారంభించి తరలిస్తూ, ఎక్కడ పడితే అక్కడ ప్రభుత్వ సంపదను కాజేస్తున్నారు, దీంతోఅధికారుల పరిరక్షణ కరువైందని చెప్పవచ్చు, స్థానిక గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ఉన్న అధికారులు ప్రజా సొమ్మును జీతాలుగా తీసుకుంటూ ప్రభుత్వ సంపదను పరిరక్షించక, పోవడం పట్ల, ఈ విషయాలలో సంబంధిత అధికారులపై, ప్రజల్లో ఉన్న నమ్మకం కోల్పోయామని పలువురు చెప్పుకొస్తున్నారు, అక్రమాలు అవినీతిని అరికట్టాల్సిన అధికారులు కక్కుర్తి బాటలో పడడం పై ఇలాంటి అక్రమాలు తెచ్చి మీరుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలి. చప్పరించాక మిగిలిపోయిన ప్రజా సంపదను ఇకనైనా కాపాడాలని ప్రజానీకం అధికారులను కోరుతున్నారు.

యథేచ్ఛగా తరలిపోతున్న ఇసుక

క్రీడాభివృద్ధికి పెద్దపీట

నగరిలో నేషనల్ కబడ్డీ కోచింగ్ క్యాంప్: ఆర్కేరోజా

ప్రజాశక్తి- నగరి: ప్రభుత్వం ఎన్నడూ లేని విధంగా క్రీడలకు పెద్దపీట వేస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. గురువారం తన నివాసం వద్ద జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు వెళ్లే అండర్ 17 బాలురను ప్రోత్సహించి జాతీయ స్థాయిలో రాష్ట్రప్రతిభను చాటిచెప్పాలని ఆశీర్వదిస్తూ సాగనంపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తగిన ప్రోత్సాహం ఉంటే క్రీడల్లో తాము రాణిస్తామంటూ రాష్ట్ర క్రీడాకారులు నిరూపిస్తున్నారని అన్నారు. ఎన్నడూ లేని ప్రోత్సాహం క్రీడలకు ప్రస్తుత ప్రభుత్వం అందిస్తుండటంతో జాతీయస్థాయి పోటీలకు వెళ్లేవారి సంఖ్య, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనభరచి పతకాలు సాధించేవారి సంఖ్య పెరిగిందన్నారు. 48 క్రీడాంశాల్లో జాతీయస్థాయిలో హాజరయ్యే క్రీడాకారులకు ఇప్పటివరకు క్రీడాచరిత్రలో లేనివిధంగా ట్రాక్‌షూట్, షూస్, మండల స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు రిజర్వేషన్‌తో కూడిన రవాణా సౌకర్యం, ఎన్ని రోజులు క్రీడలు నిర్వహించినా అన్ని రోజులకు భోజనవసతి ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ఇది క్రీడారంగంలో నభూతో నభవిష్యత్ అన్నారు. చౌడేపల్లిలో జరిగిన అంతర్‌జిల్లాల పోటీల్లో ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు గత వారం రోజులుగా నగరి పట్టణంలో కోచింగ్ క్యాంప్ జరుగుతోందన్నారు. క్యాంప్‌లో శిక్షణ పొందినవారు నేడు జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు తెలంగాణ కామారెడ్డిలో జరిగే పోటీలకు వెళుతున్నారన్నారు. ఆపోటీల్లో అత్యంత ప్రతిభ కనభరచి రాష్ట్రప్రతిభను చాటాలంటూ ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు మాట్లాడుతూ తమకు ఎన్నడూ లేని ప్రోత్సాహం ప్రభుత్వం అందిస్తుంది కనుకే తాము ఉత్సాహంగా పాల్గొంటున్నామని జాతీయస్థాయి వరకు వెళ్లగలుగుతున్నామని అన్నారు. క్రీడాకారుల తరపున ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేష్‌బాబు, కోచ్‌లు ఎన్.మణి, ఎస్.రాజ, సుమన్, చంద్ర ప్రభుత్వానికి, క్రీడాశాఖ మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

రెండో రోజూ మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన సమ్మె గురువారానికి రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ తీరును నిరసిస్తూ నేలపై పడుకున నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ పారిశుద్ధ్యం కార్మికులు ఇంజనీర్ విభాగం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం వేతనం పెంచాలని, ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సమ్మె చేస్తున్నా ప్రభుత్వం మొద్దు నిద్రపోతుందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకులు శరవణ, జయప్రకాష్, వెంకటేష్, లక్ష్మి, వాసు, జయశంకర్, సురేష్, వినాయక, సుగుణ, ఈశ్వర్, రమణి, చిత్ర, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నేలపైన పడుకుని నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

ప్రజాశక్తి- చౌడేపల్లి: స్థానిక పోలీసుస్టేషన్‌లో జిల్లా ఎస్పీ రిశాంత్ రెడ్డి గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్టేషన్‌లోని పలు రికార్డులు, ఫైల్స్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై చట్టపరమైన కఠినచర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణంలోని వారపుసంతలో మొబైల్‌ఫోన్లు అధికంగా చోరీకి గురిఅవుతున్నాయని, ఐస్టాండ్‌లో మద్యంతాగి మహిళలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తన దృష్టికి వచ్చిందని తెలిపారు. వచ్చిన ఫిర్యాదులపై నిఘా ఏర్పాటు చేసి చోరీలకు, వేధింపులకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. అలాగే ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని తెలిపారు. పలమనేరు డిఎస్పీ సుధాకర్ రెడ్డి, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

'వైసిపి'తో ప్రజలు విసుగెత్తారు: చల్లా

ప్రజాశక్తి- పుంగనూరు: ఆటు రాష్ట్రంలోనూ ఇటు పుంగనూరు నియోజకవర్గంలో వైసిపి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలపై ప్రజలు విసుగు చెందారని నియోజకవర్గ ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి ఆరోపించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని పుంగునూరు మండలం వనమలదీన్నె పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో గురువారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి మద్దతుగా జనసేన పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజలు వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపడానికి సిద్ధంగా ఉన్నారని, గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు పర్యటిస్తుంటే ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని దీనిని బట్టి చూస్తే తెలుగుదేశం పార్టీ విజయం తథ్యమన్నారు. టిడిపి పార్టీ రూరల్ అధ్యక్షుడు మాధవరెడ్డి, తెలుగుయువత ఉపాధ్యక్షుడు రెడ్డప్పనాయుడు, సివిరెడ్డి, ఆసురి బాలాజీ, చిన్న మోహన, నాగరాజా, జనసేన పార్టీ నాయకులు పగడాల రమణ పాల్గొన్నారు.

ఎస్ఆర్‌పురం: మండలం పిల్లారికుప్పం పంచాయతీ మూలూరు గ్రామంలో మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గంధమనేని జయశంకర్ నాయుడు ఆధ్వర్యంలో బీసీ సెల్ అధ్యక్షుడు హేమాద్రి యాదవ్, యూనిట్ ఇంచార్జ్ నిరంజన్ అధ్యక్షతన భవిష్యత్తు గ్యారంటీ బాబు ష్యూరిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు.

క్రీడా సామగ్రి వితరణ

ప్రజాశక్తి- పుంగనూరు: పుంగనూరు నియోజకవర్గంలో క్రీడలు అభివద్ధి దిశగా తన వంతుగా కృషి చేస్తానని విశ్రాంతి డిఎస్పి కె.సుకుమార్‌బాబు తెలిపారు. గురువరాం పట్టణంలోని హైస్కూల్ వీధిలో వాల్మీకి మహర్షి సేవా సంఘం, శ్రీ ప్రగతి దాత వాలంటీర్ సేవాసంస్థ ఆధ్వర్యంలో క్రీడాకారులకు ఉచితంగా క్రీడా కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలపై ఆసక్తి ఉన్న వారికి క్రికెట్, వాలీబాల్, కిట్లు, నెట్టు, దుస్తులు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామానికి ఈ కిట్లు అందజేయడానికి సిద్ధంగా ఉన్నాయని, అవసరమున్న జట్లు పూర్తి వివరాలతో పాటు సంప్రదించాలని, జట్ల కెప్టెన్లు వారి జట్టు సభ్యుల పేర్లు వారి ఆధార్, మొబైల్ నెంబర్లతో తమను సంప్రదించాలని సూచించారు. దివంగత డేవిడ్, రాజప్రకాష్‌ల జ్ఞాపకార్థం ఈకార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

విద్యార్థులకు భోజన ప్లేట్లు విరాళం

ప్రజాశక్తి- సోమల: మండలంలోని ఇరికిపెంట పంచాయతీ వడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన పూర్వవిద్యార్థి లక్ష్మీప్రసాద్ తన తల్లిదండ్రులైన కీర్తిశేషులు పగడాల కష్ణమూర్తి, రాజమ్మల జ్ఞాపకార్థం రూ.20వేల విలువచేసే స్టీల్ ప్లేట్లను విద్యార్థులకు విరాళంగా అందజేశారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దాత లక్ష్మీప్రసాద్ తల్లిదండ్రులు ఇరువురు ఇదే పాఠశాలలో ఎన్నో సంవత్సరాలు ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహించారని, వారి జ్ఞాపకార్థం చిన్నారులకు మధ్యాహ్న భోజనం తినేందుకు వీలుగా 150 స్టీల్ ప్లేట్లు అందజేయడం ఎంతో సంతోషించదగ్గ విషయమని అన్నారు. దాత తరపున స్టీల్ ప్లేట్లు పాఠశాలకు అందించిన నరసింహులు, మహేష్ మాట్లాడుతూ పాఠశాల తరగతి గదుల వరండాలకు రూ.2లక్షల విలువచేసే ఇనుప గ్రిల్స్‌ను కూడా అందజేశారని గుర్తుచేశారు. పాఠశాల సిబ్బంది ప్రేమరాంబ, సురేంద్ర, హేమ, విజయ, మధుమతి, విద్యార్థిని విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి- సోమల: సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండి గ్రామాలలో ప్రజలను పరిశుభ్రతపై అవగాహన కల్పించి రోగాల నిరోధానికి కషి చేయాలని కందూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని విజయలక్ష్మి అన్నారు. గురువారం ఆషాడే సందర్భంగా వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుష్టు వ్యాధి నివారణ కోసం డిసెంబర్ 27వ తేదీ నుండి జనవరి 12వ తేదీ వరకు గ్రామాలలో సర్వే నిర్వహిస్తున్నామని, ఈసర్వేలో కుష్టు వ్యాధి సంబంధిత రోగులను గుర్తించి వారికి ప్రభుత్వం ఉచితంగా అందజేసే మందులను గురించి తెలియజేసి కుష్టువ్యాధి నిర్మూలనకు పారదర్శకంగా సర్వే చేయాలని కోరారు. గ్రామాలలో పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, మురుగునీరు నిలువ ఉండకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలని కోరారు. ఎంపీహెచ్ఈఓ కుమార్ వెంకటేశ్వర్లు, సూపర్వైజర్ ప్రమీలమ్మ, ఎల్‌హెచ్‌పిలు శేషకుమార్, భావన, ఏఎన్ఎంలు భూదేవి, జయమ్మ, హిమబిందు పాల్గొన్నారు.

యానాది కాలనీకి సిమెంట్ రోడ్డు

ప్రజాశక్తి- పెద్దపంజాణి : మండలంలోని కోగిలేరు యానాది కాలనీకి సీసీరోడ్డు మంజూరైనట్లు సర్పంచ్ రమేష్ బాబు తెలిపారు. ఇటీవల జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సర్పంచ్, గ్రామస్తులు కోగిలేరు మెయిన్ రోడ్డు నుండి యానాది కాలనీకి రోడ్డు మంజూరు చేయాలని పలమనేరు ఎమ్మెల్యే ఎన్.వెంకటేగౌడ విన్నవించడంతో స్పందించిన ఎమ్మెల్యే జీజీఎంపీ నిధులతో సీసీ రోడ్డు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈమేరకు కోగిలేరు మెయిన్ రోడ్డు నుండి యానాది కాలనీ వరకు 415 మీటర్లు రూ.30లక్షలు జీజీఎంపీ నిధులు మంజూరు చేశారు. గురువారం జేసీబీ తో సీసీ రోడ్డు నిర్మాణానికి మట్టి పనులు చేపట్టారు. త్వరలోనే సీసీ రోడ్డు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. శివశంకర్ రెడ్డి, వెంకటరెడ్డి, సుబ్రమణ్యం, కిట్టన్న, లోకేశ్వరి, లోకేష్, పాల్గొన్నారు.

విద్యార్థుల మెదడుకు పదును

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: వ్యాస, వక్తృత్వ పోటీలను నిర్వహించినప్పుడే విద్యార్థుల మెదడుకు పదును పెరుగుతుందని ఎంఈఓ ఆంజనేయులుశెట్టి పేర్కొన్నారు. ఆడపిల్లల భద్రతపై మండలంలోని వివిధ స్కూళ్లలో 6 నుంచి 10 తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు 15మందికి గంగాధరనెల్లూరు హైస్కూల్లో గురువారం వ్యాసరచన, వక్తత్వ, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ఇక్కడ నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను చిత్తూరు పిసిఆర్ కాలేజీలో జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను చిత్తూరు పిసిఆర్ కాలేజీలో జిల్లాస్థాయిలో నిర్వహించే పోటీలకు హాజరవుతారని ఎంఈఓ చెప్పారు. హెచ్.ఎం హేమలత, టీచర్ మురళి పాల్గొన్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నాం : పెద్దిరెడ్డి

రూ.3వేలకు పెంచి పింఛన్లు పంపిణీ

పెంఛన్‌కార్డులు అందజేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన ప్రతి హామీని ముఖ్యమంత్రి వైయస్. జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక,భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో వైఎస్సార్ పింఛన్ల పంపిణీ జిల్లాస్థాయి కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి మంత్రి పెద్దిరెడ్డితో పాటు జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, చిత్తూరు ఎంపి ఎన్.రెడ్డప్ప, జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్, డిఆర్ఓ ఎన్.రాజశేఖర్, చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నగర మేయర్ అముద పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం అవ్వాతాతలకు రూ.3వేలు పింఛన్ అందిస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జనవరి 8 వరకు పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలలో 99.5 శాతం నెరవేర్చారన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో కూడా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అర్హుల బ్యాంక్ ఖాతాలకు నగదును నేరుగా జమచేయడం జరిగిందన్నారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు జిల్లాలో అభివద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. గత 5 సంవత్సరాల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా రూ.83,556 కోట్లు పెన్షన్ల కోసం ఖర్చు చేయడం జరిగిందన్నారు. పాడి రైతులను ఆదుకునే విధంగా పాల మద్దతు ధరను పెంచడం జరిగిందన్నారు. జిల్లా ప్రజలకు సేవలందించడానికి మంత్రి స్థాయి నుండి క్రింది స్థాయి వరకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉన్నామన్నారు.

కార్వేటినగరం: అవ్వా తాతలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ఏకైక ముఖ్యమంత్రి వైస్ జగన్మోహన్రెడ్డి అని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. గురువారం మండల పరిధిలోని సీడీ కండ్రిగ గ్రామంలో సర్పంచ్ మంగమ్మ, ఎంపీటీసీ నందిని ఆధ్వర్యంలో పెంచిన పింఛన్ పంపిణీ చేశారు. ఏఎంసీ డైరెక్టర్ ఆకుల గోపి, మాజీ సర్పంచ్ గోవిందస్వామి, కుప్పారెడ్డి, నాయకులు లోకనాథ నాయుడు, ధన్రాజ్, రంగయ్య, రాజారాం, మురళి పాల్గొన్నారు.

పుంగనూరు: పేదల అభివద్ధి లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం గడచిన నాలుగేళ్ల కాలంలో పని చేసిందని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో పెంచిన పెన్షన్లు చేశారు. మండలంలో 8330 పెన్షన్లకు గాను 2 కోట్ల 43లక్షల రూపాయలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

ముడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, వైసీపీ రూరల్ అధ్యక్షుడు చెంగారెడ్డి, మాజీ ఎంపీపీ నరసింహులు, విజయ భాస్కర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, జయరామిరెడ్డి పాల్గొన్నారు.

సోమల: మండల కేంద్రమైన సోమల ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని సమావేశ మందిరంలో రాష్ట్ర వైకాపా కార్యదర్శి పెద్దిరెడ్డి నూతన పింఛన్లు, పాత పింఛన్లకు పెంచిన నగదును పంపిణీ చేశారు. మండలంలో అన్ని పంచాయతీలకు కలిపి 102 నూతన పింఛన్లు మంజూరయ్యాయని 3.60లక్షల నూతన పింఛన్లకు నిధులు మంజూరయ్యాయని, మొత్తం మండలంలో 7391 పింఛన్లు ఉన్నాయని వీటి కోసం ప్రతినెల రెండు కోట్ల 17 లక్షల 58వేల 500 రూపాయలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఎంపీపీ ఈశ్వరయ్య, జెడ్పిటిసి అమర కుసుమ మోహన్, వైస్ ఎంపీపీ ప్రభాకర్, ఎంపీటీసీ హరినాథ్, సర్పంచులు బాషా మునాఫ్, రమణ, భారతి, రెడ్డప్ప పాల్గొన్నారు.

రామకుప్పం: ఎంపీడీఓ రాధకష్ణ శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సర్కిల్ వద్ద పెన్షన్‌పెంపు ఉత్సవంలో పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలోని పెన్షన్ లబ్దిదారులు 8728 ఉండగా, నూతనంగా 137 మంజూరయ్యాయి. రెండు కోట్ల 67 లక్షల 49 వేల రూపాయలు నేడు పెన్షన్ లబ్దిదారులకు పంపిణీ చేసినట్లు తెలిపారు.

శాంతిపురం: రాళ్ళబూదుగూరు గ్రామ పంచాయతీలో నూతనంగా పింఛన్లకు అర్హులైన 22 మందికి గురువారం పెంచిన రూ.3వేలను పింఛన్‌దారులకు మండల కోఆప్షన్ నిసార్ అందించారు. సర్పంచ్ లక్ష్మి మురుగేష్, వైస్ సర్పంచ్ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి వనిత పాల్గొన్నారు.

పక్కాగా పారిశుద్ధ్య పనులు: కమిషనర్

పారిశుధ్య పనులు తనిఖీ చేస్తున్న నగర కమిషనర్ అరుణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మున్సిపల్ అవుట్సోర్సింగ్ కార్మికుల సమ్మె నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పారిశుధ్య పనులు పక్కగా చేపట్టాలని, పారిశుద్ధ్య పరంగా ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం నగరంలో జరుగుతున్న పారిశుధ్య పనులను కమిషనర్ పర్యవేక్షించారు. గాంధీరోడ్డు కూడలి, చర్చి వీధి, పాత బస్టాండ్, కొండారెడ్డిపల్లి ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. చెత్త తరలించే వాహనాల డ్రైవర్లతో మాట్లాడారు. ఎక్కడ వ్యర్థాలు కనిపించకుండా తొలగించాలన్నారు. స్థానికంగా వ్యాపారస్తులు, దుకాణదారులతో మాట్లాడారు. ఔట్సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికుల సమ్మె నేపథ్యంలో వ్యర్థాలను ఇష్టారాజ్యంగా పడేయవద్దని, చెత్త సేకరించే వాహనాలకు అందించి సహకరించాలన్నారు. నగరంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణపై ప్రజారోగ్య విభాగం అధికారులతో సమీక్షించారు. వ్యర్థాల సేకరణ, రవాణాకు సంబంధించి ప్రత్యామ్నాయాలను ఉపయోగించుకోవాలన్నారు. రద్దీ ప్రాంతాలు, ప్రధాన కూడళ్ళు, రహదారుల్లో ఎక్కడ వ్యర్థాలు కనిపించకుండా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ పారిశుద్ధ్య పరంగా ఎక్కడ లోపాలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, సానిటరీ ఇన్స్పెక్టర్లు చిన్నయ్య, నరసింహ, లోకనాథం పాల్గొన్నారు.

టిడిపిలోకి వైసిపి నేతలు

ప్రజాశక్తి- రామకుప్పం: మండలంలోని బందార్లపల్లి, కొంగనపల్లి, పెద్దూరు, పంచాయతీలకు చెందిన వైసీపీ కార్యకర్తలు గురువారం మంగళగిరి తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో చేరారు. వైసిపి నేతలు చంద్ర, పెరిపయ్య, వెంకటాచలం, వెంకటేష్, మంజునాథ్‌రెడ్డి, సుకుమార్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, వెంకటాచలపతి, నూరుల్లా, రియాజ్, అష్రఫ్ అలీ, రహీంసాబ్, మురుగేష్, రవి, సుబ్రహ్మణ్యం శ్యాంసుందర్, మునిరత్నం, కాళీమ్మ, సాలమ్మ, వల్లెమ్మలకు చంద్రబాబు కండువాలు వేసి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. వారి వెంట మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, రాష్ట్ర ఎస్సీసెల్ ఉపాధ్యక్షులు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్రా నారాయణచారి ఉన్నారు.

'ప్రజాసేవ చేసే నేతలను ఆదరించండి'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

రాజకీయాలంటే ఎన్నికలకు రెండు నెలల ముందు ప్రజలకు కనిపించడం కాదు.. ఎన్నికల తర్వాత 58 నెలలపాటు ప్రజలకు అందుబాటులో ఉండడమే అసలైన ప్రజాసేవని ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ విజయానంద రెడ్డి అన్నారు. చిత్తూరులోని దర్గా కూడలి వద్ద చిత్తూరు నగరం కార్పొరేషన్ సభ్యులు అను ఆధ్వర్యంలో పలువురు విజయానంద్ రెడ్డి సమక్షంలో వైసీపీలో చేరారు. విజయానందరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సేవచేయాలని నిస్వార్థంగా పనిచేసే నాయకులను ప్రజలు ఆదరించాలని కోరారు. కొన్ని పార్టీల్లో నేతలు ఎమ్మెల్యే టికెట్ కోసం ఎన్నికలకు ముందు రెండు నెలలు వచ్చి ప్రజల్లో హడావిడి చేస్తుంటారని విమర్శించారు. ఎన్నికలు ఉన్నా లేకున్నా నిత్యం ప్రజల్లో ఉండే నాయకులని ప్రజలు గెలిపించుకోవాలని కోరారు.

బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే...

కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందిస్తున్న చింతా మోహన్

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: రాష్ట్రంలో పేదవాళ్ళు మూడు పూట్ల తిండి లేక పస్తులున్నారని, ప్రతి కుటుంబం అప్పుల పాలై ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల అభివద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అన్నారు. గురువారం ఎస్ఆర్ పురం మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ 49. కొత్తపల్లిమిట్టలో మాజీ మహిళా అధ్యక్షురాలు చందు రాణి, మండల పార్టీ అధ్యక్షులు తులసి మణి ఆధ్వర్యంలో మార్పు కావాలి కాంగ్రెస్ రావాలి క్రమంలో భాగంగా మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంచారు. డిసిసి పోటుగారి భాస్కర్, గంగాధర్ నెల్లూరు కోఆర్డినేషన్ కమిటీ మెంబర్లు మణికష్ణ, కన్నన్, సుబ్బరాయులు, పాలసముద్రం మండల అధ్యక్షులు పుష్పరాజ్, బుజ్జిరెడ్డి, నారాయణ, పరదేశి, రాణి యాదవ్, ధనలక్ష్మి పాల్గొన్నారు.

'రాణి మహల్‌కు మహర్దశ తెస్తాం'

ప్రజాశక్తి- కార్వేటినగరం: సంస్థానాధీశులు నిర్మాణం చేపట్టిన రాణి మహల్‌కు మహర్దశ కల్పించేందుకు ప్రభుత్వం కషిచేస్తోందని డీఈవోలు విజయేంద్రరావు (చిత్తూరు) డాక్టర్ శేఖర్ (తిరుపతి) అన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి చొరవతో కమిషనర్ ఆదేశాల మేరకు రాణీమహల్‌ను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవోలు మాట్లాడుతూ వందల సంవత్సరాల క్రితం కార్వేటినగరం సంస్థానాధీశులు కోట్లు వెచ్చించి నిర్మాణం చేపట్టిన చారిత్రక కట్టడం శిథిలావస్థకు చేరుకోవడంతో గుర్తించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి రాణీమహల్‌కు పునర్జీవం పోయాలని పురావస్తుశాఖ అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. దీంతో స్పందించిన కమీషనర్ రాణిమహల్ స్థితిగతులను పరిశీలించి వాటి వివరాలను సేకరించాలని ఆదేశించారన్నారు. అలాగే ఈ మహల్‌ను పాఠశాలగా వినియోగించుకోవడంతో ప్రభుత్వ మరింత శ్రద్ధ తీసుకుని అభివద్ధి చేయడానికి కషి చేస్తుందన్నారు. త్వరలో పురావస్తుశాఖ అదికారులు చొరవ తీసుకుని మహల్‌కు మర్మతులు చేసి చారిత్రాక కట్టడాని పునర్జీవం పోసి చూపరులను ఆకట్టుకునే విధంగా నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు. ఎంపీపీ లత బాలాజీ, సర్పంచ్ ధనంజయవర్మ, ఎంఈవోలు విజయకుమార్, మనోజ్ కుమార్, ఆర్కేఎస్సార్ ఉన్నత ఉపాధ్యాయులు పాఠశాల హెచ్ఎ ఎం.కోటేశ్వర్రావు, మాధవరెడ్డి, ఉమాశంకర్, విశ్రాంతి హెచ్ఎం విజయకుమార్ వెళ్లై, రాజశేఖర్ ఉన్నారు.

రాణి మహల్‌ను సందరిస్తున్న డీఈవోలు, అధికారులు

కనీస వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి- నగరి: మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేల ఇవ్వాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. గురువారం నగరిలో రెండవ రోజు కొనసాగుతున్న మున్సిపల్ కార్మికులు సమ్మెకు మద్దతు తెలిపారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం నంజంపేట ప్రాథమిక పాఠశాల ఆవరణంలో నేడు శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్య సిబ్బంది తెలియజేశారు. ఈ వైద్యశిబిరం ఉదయం 9 గంటలకు ప్రారంభమై అన్ని రకాల ఆరోగ్య సమస్యలకు ప్రత్యేకంగా వైద్యశిబిరానికి వచ్చే నలుగురు డాక్టర్లు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మెరుగైన చికిత్స కోసం ఇతర ఆసుపత్రులకు రెఫర్ చేయడం అవసరమైన వారికి మందులు అందజేయడం జరుగుతుందని తెలిపారు.

సోమేశ్వర ఆలయానికి విరాళం

ప్రజాశక్తి- శాంతిపురం: మండల పరిధిలోని అబకలదొడ్డిలో వున్న శ్రీ సోమేశ్వర స్వామి దేవాలయానికి శాంతిపురం మండల జడ్పీటీసీ శ్రీనివాసులు రూ.51వేలు తన వంతు విరాళంగా గ్రామ సర్పంచ్ చిన్నప్ప, వార్డు సభ్యులు కిరణ్, గ్రామపెద్దలకు అందించారు. ప్రతాప్‌రెడ్డి, రమేష్, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

చుక్కల జింక మృతి

ప్రజాశక్తి- శాంతిపురం: మండల పరిధిలోని సోగ్గాడి బల్ల ఎల్లమ్మ గుడి వద్ద పొలానికి వేసిన కంచెను దాటడానికి ప్రయత్నించి కంచెను ఢీకొని చుక్కల జింక మతి చెంది ఉండవచ్చునని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. జింక మృతి విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న అటవీశాఖ సిబ్బందికి ఘటనా స్థలానికి చేరుకొని మతి చెందిన జింకను పరిశీలించారు. జింక 75కిలోలు ఉండవచ్చునని, మృతికి గల కారణాలు తెలియడానికి పోస్టుమార్టం అనంతరం తెలుస్తుందని అన్నారు.

నేత్రవైద్య శిబిరానికి అనూహ్య స్పందన

ప్రజాశక్తి-నగరి: కంటివైద్య చికిత్సను ఉచితంగా అందించడానికి మంత్రి ఆర్కేరోజా చారిటబుల్ ట్రస్టు, శంకరనేత్రాలయ సంయుక్త ఆద్వర్యంలో నిర్వహించిన నేత్ర వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభిస్తోంది. మంత్రి క్యాంప్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఈ క్యాంప్‌లో రెండు రోజులకు 300 మందికి వైద్య సిబ్బంది చికిత్స అందించారు. వీరిలో కంటి పొర కారణంగా చూపు మందగించిన 60 మందిని ఎస్‌మొబైల్ ఐ సర్జికల్ యూనిట్ ద్వారా మైక్రో స్కోపిక్ స్మాల్ ఇన్‌సిషన్ అనే నవీన పద్దతిలో ఆపరేషన్ చేయడానికి ఎంపిక చేశారు. వీరికి ఈ నెల 8వ తేదీన ఆపరేషన్ చేయనున్నట్లు శంకర నేత్రాలయ ప్రతినిధి అరుల్‌కుమార్ తెలిపారు. చికిత్స నిమిత్తం కార్యాలయం వద్దవున్న వారికి భోజన సౌకర్యం కల్పించారు.

వెంకటేష్‌కు పెరుగుతున్న మద్దతు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పూతలపట్టు, ఎస్సి నియోజకవర్గం అసెంబ్లీ టికెట్ ఆశిస్తున్న కోడిగుట్ల వెంకటేష్‌కు దళిత సంఘాల నుండీ మద్దతు పెరుగుతోంది. గురువారం విజయవాడలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ ఎమ్మార్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణరాజు, చిత్తూరు జిల్లా పూతలపట్టు ఎస్సి రిజర్వేడ్ అసెంబ్లీ టికెట్ (వైఎస్సార్‌సీపీ) ఆశిస్తున్న తొట్ల వెంకటేష్‌ని మర్యాద పూర్వకంగా కలసి పుష్ప గుచ్చాలతో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా దాసరి సువర్ణ రాజు మాట్లాడుతూ మాదిగలు ఎక్కువగా ఉన్న రాయలసీమ జిల్లాలో ఎస్సి రిజర్వేడ్ అసెంబ్లీ స్థానాలలో మాదిగలకు కేటాయించి సామాజిక న్యాయం పాటించాలని కోరారు. ఎపిఎంఆర్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మందా నాగమల్లేశ్వరరావు, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు బాబు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు నల్లమోతు సురేష్ పాల్గొన్నారు.

యుటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండల విద్యావనరుల కేంద్రంలో గురువారం యుటిఎఫ్ క్యాలెండర్ డైరీలను ఎంఈవో 2 మహేశ్వరరావు, దామోదరం ఆవిష్కరించారు.

వావ్.. క్యాలెండర్ ...!

జిల్లాలోని వెదురుకుప్పం మండలంలో అమెరికా దేశానికి చెందిన పౌరులు క్యాలెండర్‌ను చూసి అవాకయ్యారు.. ఇక్కడ ఫొటోలతో కూడిన క్యాలెండర్లను ఇలా ప్రింట్ చేస్తారని ఆసక్తిగా తిలకించారు. స్థానిక ఇండియన్ పెట్రోల్ బంకు దగ్గర ప్రజాశక్తి విలేకరి మోహన్ రెడ్డి, డివిజన్ ఇన్‌ఛార్జి ప్రశాంత్ కుమార్ ప్రజాశక్తి క్యాలెండర్ పంపిణీలో ఉండగా.. అమెరికన్లు గమనించి ఇది ఏమిటని అడిగి తెలుసుకున్నారు. న్యూ ఇయర్ క్యాలెండర్ బ్యూటిఫుల్‌గా ఉందంటూ ఆసక్తిగా గమనిస్తూ క్యాలెండర్లను తీసుకున్నారు..

- ప్రజాశక్తి- వెదురుకుప్పం

నేడు 'మామిడి'పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి- సోమల: సోమల, చౌడేపల్లి మండలాలకు చెందిన మామిడి రైతులకు మండల కేంద్రమైన సోమల శ్రీశక్తి భవన్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం రెండు గంటలకు మామిడి పూత. పిందెదశలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్ రెడ్డి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారనిఉద్యాన శాఖ అధికారి సంతోషి కుమారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మామిడి రైతులు తప్పక హాజరై అధికారులు చెప్పే సలహాలు సూచనలు తెలుసుకోవాలని కోరారు.

సదుం: మామిడి పంట సాగు, యాజమాన్య పద్ధతులపై శుక్రవారం సదుం ఎంపిడిఓ కార్యాలయంలో రైతులకు అవగాహన కార్యక్రమం జరగనున్నట్లు చౌడేపల్లి ఉద్యాన అధికారిణి సంతోషి కుమారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్ రెడ్డి, ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి పాల్గొంటారని, ఈఅవకాశాన్ని మామిడి రైతులు ఉపయోగించుకోవాలని తెలిపారు.

పిహెచ్‌సికి ఫ్రిడ్జ్ వితరణ

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: చిత్తూరు పట్టణానికి చెందిన ఎంవి.కేశవరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ చైర్మన్ ఎంవి.శ్రీధర్‌రెడ్డి ఆర్థిక సహకారంతో రూ.16వేలు విలువ చేసే ఫ్రిడ్జ్‌ను గంగాధర నెల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ దుర్గాదేవికి గురువారం అందజేశారు. అలాగే రెడ్‌క్రాస్ ద్వారా ఆరోగ్య సిబ్బందికి 500 మాస్కులు పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్, రెడ్‌క్రాస్ కార్యదర్శి సహదేవ నాయుడు, రెడ్‌క్రాస్ మండల అధ్యక్షుడు పాపిరెడ్డి, రెడ్‌క్రాస్ ఏవో గోపి, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

వైసిపి మండలం సేవాదళ్

ఉపాధ్యక్షులుగా పెనువేలు సింహ

ప్రజాశక్తి - రామకుప్పం: మండలానికి చెందిన వైసిపి నేత పెనువేలు సింహను జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ చిత్తూరు జిల్లా వైసిపి అధ్యక్షుడు భరత్ నియామక పత్రం అందజేశారు. ఈ సదర్భంగా పెనువేలు సింహ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ రెడ్డప్ప తనకు ఈ బాధ్యతలు అప్పగించినందుకు కతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి, రానున్న ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులు గెలుపుకు తన శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

ఉరి వేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి- పలమనేరు: స్థానిక మహిళా పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్లో విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు శ్రీరంగరాజపురంకు చెందిన రసజ్ఞ (17) స్థానిక మహిళా పాలిటెక్నిక్ కళాశాల చదువుతోంది. అదే కళాశాలక చెందిన హాస్టల్లో ఉంటోంది. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోవడాన్ని గుర్తించి హుటాహుటిన పలమనేరు ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు దవీకరించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

IN THE COURT OF THE PRL. JUNIOR CIVIL JUDGE OF CHITTOOR
I.A.No. 918 of 2021
I.A.No. 919 of 2021
I.A.No. 780 of 2019
O.S.No. 841 of 2019

Between
K.Lakshmamma and others ...Plaintiffs
And
K.Vemanna(died) and others ...Defendants

Notice to 3rd Respondent

To
K.Harish @ Paradesi,
S/o Late K.Ramaiah,
Ootuvanka Village, G.K.Vooru Post,
Bangarupalem Mandal,Chittoor Dist

Sir,
Please take notice that the above **I.A No.918 fo 2021** filed to implead legal heirs of deceased 1st defendant and **I.A.No. 919 of 2021** filed to implead the proposed parties and **I.A.780/2019** filed seeking temporary Injunction. All these three I.As are posted on **02-02-2024** for your appearance. Hence you are required to attend on **02-02-2024 at 10.30 A.M** in above said court either in person or through advocate and file objections if any, Otherwise the matter will be decided exparte.

Sd/- K.PATTABHI
Advocate,Chittoor

IN THE COURT OF THE PRL. JUNIOR CIVIL JUDGE OF CHITTOOR
O.S.No. 841 of 2019

Between
K.Lakshmamma and others ...Plaintiffs
And
K.Vemanna(died) and others ...Defendants

Summons to 3rd Defendant

To
K.Harish @ Paradesi,
S/o Late K.Ramaiah,
Ootuvanka Village, G.K.Vooru Post,
Bangarupalem Mandal,Chittoor Dist

Sir,
Please summons that the above case is posted on **02-02-2024** for your appearance. Hence you are required to attend on **02-02-2024 at 10.30 A.M** in above said court either in person or through advocate and file objections if any, Otherwise the matter will be decided exparte.

Sd/- K.PATTABHI
Advocate,Chittoor